నమ్మకానికి నామినేటెడ్ పదవి

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి

ఈనాడు, కర్నూలు : రాష్ట్రంలో పలు కార్పొరేషన్లకు అధ్యక్షులు, సభ్యులను నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. డోన్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేసిన మన్నె సుబ్బారెడ్డి అలియాస్ ధర్మవరం సుబ్బారెడ్డికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మరో నలుగురికి వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లు/సభ్యుల పదవి కట్టబెట్టారు. 2017లో తెదేపాలో చేరిన సుబ్బారెడ్డి 2021వ సంవత్సరం నుంచి డోన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. గత ఎన్నికల్లో కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంతో ఆయన మనస్తాపానికి గురయ్యారు. అధిష్ఠానం హామీతో 'కోట్ల' విజయానికి సహకరించారు.. ఈ నేపథ్యంలో ఆయనకు కీలక పదవి కట్టబెట్టారు.

రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యుడిగా కొంకతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యుడిగా కర్నూలుకు చెందిన కొంకతి లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. తెదేపా సానుభూతిపరుడైన ఆయన 2013 నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. 2021 నుంచి రాయలసీమ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ తర్వాత తెదేపాలో చురుగ్గా పనిచేశారు. తన సామాజిక వర్గంలో పట్టున్న వ్యక్తిగా గుర్తింపు పొందారు. బీసీ వర్గీయుడైన ఆయన తెదేపా రాష్ట్ర కార్యదర్శిగానూ నియమితులయ్యారు. గత ఎన్నికల్లో అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గానికి పరిశీలకుడిగా వ్యవహరించారు. మంత్రి టీజీ భరత్ వర్గీయుడిగా గుర్తింపు పొందారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా తులసిరెడ్డి

నంద్యాల సమీపంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తాతిరెడ్డి తులసిరెడ్డి మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తొలుత తెదేపాలో చేరిన ఆయన మంత్రి ఫరూక్ అనుచరుడిగా గుర్తింపు పొందారు. గతంలో ఆయనతోపాటు ఆయన సతీమణి కొత్తపల్లి సర్పంచిగా పనిచేశారు. తెదేపా లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా సేవలందించారు. ఆ తర్వాత శిల్పా మోహన్‌రెడ్డితోపాటు కాంగ్రెస్‌లోకి.. ఆ తర్వాత వైకాపాలో వెళ్లారు. 2021లో లోకేశ్ సమక్షంలో తెదేపాలో చేరారు. ప్రస్తుతం తెదేపా రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన్ను ఉరవకొండ నియోజకవర్గ పరిశీలకుడిగా పార్టీ నియమించింది. మంత్రి ఫరూక్ అండదండలతో ఆయనకు పదవి లభించింది.

రామాంజనేయులుకు కీలక పదవి

పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరుకు చెందిన రామాంజనేయులు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. ప్రస్తుతం కల్లూరు మండల పార్టీ అధ్యక్షుడిగా, క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. వైకాపా హయాంలో ఆయన తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆయనపై రెండు కేసులు పెట్టారు. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయినప్పటికీ పార్టీ మారలేదు. గత 30 ఏళ్లుగా పార్టీలో అంకితభావంతో పనిచేస్తున్నారు. బోయ సామాజిక వర్గానికి ఆయన సేవలకు గుర్తింపుగా కీలక పదవికి ఎంపిక చేశారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సహకారంతో పదవి దక్కించుకున్నారు.

ఉప్పొంగిన వాగులు..
స్తంభించిన రాకపోకలు

డోన్, న్యూస్‌టుడే: డోన్ మండలంలోని సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి వాగులు ఉప్పొంగాయి. కొచ్చెర్వు, ఎర్రగుంట్ల, గోసానిపల్లె తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షం కురవటంతో డోన్ నుంచి బేతంచెర్లకు వెళ్లే ప్రధాన రహదారిపై వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వాహన రాకపోకలు స్తంభించాయి. మాలిక్‌బాబా గుడి మీదుగా వాగు ప్రవహించడంతో వెంకటనాయునిపల్లె రహదారిలోనూ వంతెన వద్ద రాకపోకలు నిలిచాయి. బేతంచెర్ల నుంచి డోన్‌కు వెళ్లాల్సిన వాహనాలు రెండు కి.మీ. నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఓ వాహనం వాగును దాటేందుకు వెళ్లగా మధ్యలో నిలిచిపోవడంతో క్రేన్ సాయంతో దాటించారు.



డోన్-బేతంచెర్ల రహదారిపై వరద నీరు

ఇరువైపులా నిలిచిన వాహనాలు

కుదిరిన వాటాలు
మొదలైన తవ్వకాలు

- మళ్లీ 'గద్దె'నెక్కిన మట్టి మాఫియా
- తమ్మరాజపల్లె కొండకు ఘాతాలు



కొండ అంచు నుంచి జరుగుతున్న తవ్వకాలు... నిత్యం పొక్లెయిన్లతో తవ్వకాలు

గత ఐదేళ్లూ 'గద్దె'పైనున్న మట్టి మాఫియా కొండలను సమాధి చేసింది.. కొండలకు గుండు కొట్టి రూ.కోట్లకు పడగలెత్తారు. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి రాగానే గనులు, క్వారీల్లో తనిఖీలు చేయించింది. అక్రమ మైనింగ్ తీరుపై నివేదికలు రూపొందించారు. తనిఖీ సమయంలో దాక్కున్న మాఫియా మళ్లీ రెచ్చిపోతోంది.. ఎలాంటి అనుమతుల్లేకుండానే తమ్మరాజపల్లెలోని గద్దెలకొండను తవ్వేస్తున్నారు. గత 15 రోజుల నుంచి పెద్దఎత్తున తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం. అక్రమార్కుల మధ్య వాటాల విభజన జరిగిన తర్వాతే తవ్వకాలు తిరిగి ప్రారంభమయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఆదాయం రుచి మరిగిన మైనింగ్ మాఫియా లీజు గడువు ముగిసినా సరే రేయింబవళ్లు కొండను కొల్లగొడుతోంది. ఈ అక్రమాలపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందినా మైనింగ్, రెవెన్యూ శాఖలు గాని, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గాని అటువైపు తొంగిచూడటం లేదు.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, పాణ్యం గ్రామీణం

లీజులు ముగిసినా పట్టించుకోరు

పాణ్యం మండలం తమ్మరాజపల్లెలోని గద్దెలకొండ 672 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ 23 క్వారీల ఏర్పాటుకు మైనింగ్ శాఖ పదేళ్ల కిందట లీజులు ఇచ్చింది. ఇక్కడ తవ్విన రాళ్లను కంకరగా మార్చేందుకు 14 క్రషింగ్ యూనిట్లకు అనుమతులు ఉన్నాయి. ఇక్కడ మైనింగ్ చేయాలంటే హెక్టారుకు రూ.6.50 లక్షలు చెల్లించాలి. గతంలో లీజులు తక్కువగా ఉండటంతో లీజుదారులు మైనింగ్ చేయడానికి ముందుకొచ్చారు. గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన విధానంతో లీజులు పునరుద్ధరణకు గతంలో ఉన్న మొత్తం కంటే పది రెట్లు ఎక్కువగా చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఏడాదిన్నరగా లీజుల పునరుద్ధరణ జరగడం లేదు. తవ్వకాలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయి.

చేతులు కలిపి పిండి చేస్తున్నారు

గద్దెలకొండను కొల్లగొట్టడానికి కొంతమంది నాయకులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. కొందరు టిప్పర్లు, యంత్రాలు సమకూర్చగా.. మరో నాయకుడు తవ్వకాలకు ఉపయోగించే భారీ యంత్రాలను కొండల్లో దింపారు. అధికారులు అటువైపు రాకుండా ముందస్తు 'ఒప్పందం' చేసుకుని మరీ కొండను పిండి చేస్తున్నారు. అక్రమంగా పేలుడు పదార్థాలు వినియోగిస్తూ పెద్ద ఎత్తున పేలుళ్లకు పాల్పడుతున్నారు. అక్రమాలు బయటకు రాకుండా ఎక్కడికక్కడే సర్దుబాటు చేస్తున్నారు. అక్రమంగా తవ్విన కంకరను విక్రయించగా వచ్చిన సొమ్మును నాయకులు 30, 40 శాతం వాటాలుగా విభజించుకున్నారు. మిగతా మొత్తాన్ని కొంతమంది అధికారులకు పంచుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అక్రమ మైనింగ్‌లో పేరుపొందిన ఓ నాయకుని కనుసన్నల్లోనే ప్రస్తుతం మైనింగ్ జరుగుతోంది. పరోక్షంగా పలువురు కీలక నాయకులు ఇందులో భాగస్వాములై వాటాలు తీసుకుంటున్నారు.

మట్టినీ వదలడం లేదు

కొండను పిండి చేస్తున్న క్రమంలో వచ్చే గ్రావెల్ (మట్టి)ని కూడా అక్రమార్కులు వదలడం లేదు. కంకర డస్ట్‌గా దీనిని విక్రయిస్తున్నారు. టిప్పర్ కంకర డస్టును రూ.14 వేలు, ట్రాక్టరుకు అయితే రూ.9 వేలతో విక్రయాలు సాగిస్తున్నారు. కొండను తవ్వేందుకు జిలెటిన్ స్టిక్స్ ఉపయోగిస్తున్నారు. బోర్‌వెల్ యంత్రాలతో 150 అడుగుల లోతుకు మించి రంధ్రాలు చేస్తున్నారు. వాటిని పేలుడు పదార్థాలతో నింపి భారీస్థాయిలో పేలుళ్లు జరుపుతున్నారు. దీంతో కంకర డస్టు పెద్ద ఎత్తున పోగవుతోంది. ఇది సమీపంలోని పొలాలను కప్పేస్తోంది. పంట చేళ్లు బండరాళ్లతో నిండిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా పట్టించుకునే అధికారులు కరవయ్యారు.

మట్టికొట్టుకుపోయిన నాణ్యత




రహదారి పక్కన కొండను తవ్వి ఆ మట్టినే రహదారిపై వేస్తున్నారు

ఈనాడు, కర్నూలు : కర్నూలు- ఆత్మకూరు(కేజీ రోడ్డు) మధ్య చేపడుతున్న జాతీయ రహదారి (340సి) విస్తరణ పనులు గాడితప్పాయి.. నన్నూరు టోల్‌ప్లాజా నుంచి ఆత్మకూరు వరకు 78 కి.మీ మేర నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. అడ్డగోలుగా కొండల్ని తవ్వేస్తూ.. ఆ మట్టి, రాళ్లను రహదారి నిర్మాణానికి ఉపయోగిస్తుండటం వివాదాస్పదంగా మారింది. అనుమతులు లేకుండా కొండలు తవ్వడం నిబంధనలకు విరుద్ధమని.. తవ్వాల్సి వస్తే తమ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని గతంలోనే గనులశాఖ అధికారులు గుత్తేదారు సంస్థకు నోటీసులు జారీ చేశారు. కొండను తవ్వి రాళ్లు, మట్టి ఉపయోగించినందుకు గుత్తేదారు సంస్థకు భారీ అపరాధ రుసుము విధించింది. దీంతో రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం ఆ భూమిని తమకు అప్పగించిందని, తాము అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదంటూ గుత్తేదారు సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. భవిష్యత్తులో రహదారిపై కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉంది.

కొండల్ని పేల్చి పిండి చేస్తున్నారు

రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం గనులశాఖ నుంచి గుత్తేదారు సంస్థ అనుమతులు తీసుకుంది. వారికి కేటాయించిన ప్రాంతంతో పాటు దాని పరిసర ప్రాంతాల్లోనూ ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు సాగిస్తున్నారు. మట్టి, రాళ్ల కోసం కొండల్ని పిండి చేస్తున్నారు. సుమారు వంద అడుగుల ఎత్తు వరకు కొండను నిటారుగా తవ్వేస్తుండటంతో భారీ వర్షాలు కురిస్తే మిగిలిన భాగం కుప్పకూలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రహదారి నిర్మాణంలో రకరకాల రాళ్లు, మట్టి, కంకర ఉపయోగిస్తున్నారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఇటువైపు చూడటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.




గార్గేయపురం వద్ద పనుల తీరు

నాణ్యత 'సుద్ద' అబద్ధం

ఎస్సార్బీసీ కాల్వ తవ్వినప్పుడు వచ్చిన ఎర్రబిలుకును రోడ్డు నిర్మాణంలో వాడేందుకు గుత్తేదారు సంస్థ అనుమతులు తీసుకుంది. పాములపాడు మండలం ఎర్రగూడూరు ప్రాంతంలోని ఎర్రబిలుకును ఇందుకు ఉపయోగిస్తున్నారు. ఈ ఎర్రబిలుకునే సుద్దరాయని పిలుస్తారు. దీనిని ఉపయోగించడం వల్ల రహదారి రహదారి కుంగిపోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కర్నూలు- నంద్యాల మధ్య నాలుగు వరుసల జాతీయ రహదారినీ అత్యంత నాసిరకంగా నిర్మించడంతో పలుచోట్ల కుంగిపోయింది. భవిష్యత్తులో కర్నూలు- ఆత్మకూరు మధ్య ఇదే విధంగా రోడ్డు దెబ్బతినే ఆస్కారముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నాణ్యతను కాపాడాలని కోరుతున్నారు.

ఆగిన అనుసంధానం

నంద్యాల చెక్‌పోస్టు నుంచి జాతీయ రహదారి వరకు 9 కి.మీ మేర నాలుగు వరుసల అనుసంధాన రహదారిని కూడా ప్రభుత్వం చేపట్టింది. గతేడాది ఆ పనులు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు 2.7 కిలోమీటర్ల దూరం మాత్రమే నిర్మాణం పూర్తి చేశారు. భూములు ఇచ్చిన వారికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదు. ఇప్పటి వరకు రూ.2.30 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.10.70 కోట్లు భూ యజమానులకు చెల్లించాల్సి ఉంది. దీంతో మరో 6.3 కిలోమీటర్లు రహదారి నిర్మాణం నిలిచిపోయింది. పరిహారం మొత్తం చెల్లిస్తేగాని ఈ పనులు మళ్లీ మొదలయ్యే పరిస్థితి లేదు. నూతన రహదారి నిర్మాణం కోసం గతంలో ఉన్న రోడ్డును పలుచోట్ల ఇష్టారాజ్యంగా తవ్వేశారు. దీంతో ఆ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



సీఎంకు చెక్కులు అందజేస్తున్న మంత్రి ఫరూక్

సీఎంకు రూ.26.88 లక్షల చెక్కు అందజేత

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : వరద బాధితుల సహాయార్థం జిల్లాకు చెందిన పలువురు ముఖ్యమంత్రి సహాయనిధికి ఇచ్చిన విరాళాల చెక్కులను రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. ఈమేరకు ఆయన మంగళవారం అమరావతిలో సీఎంను కలిసి రూ. 26,88,616 విలువ చేసే చెక్కులను అందించారు.

లడ్డూ కల్తీ బాధ్యులను శిక్షించాలి



మాజీ సీఎం, మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న వైఎస్సార్ నగర్ మహిళలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూ కల్తీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని మహిళలు నినదించారు. నంద్యాల పట్టణంలోని నూనెపల్లె, వైఎస్సార్ నగర్ సర్కిళ్లలో మహిళలు మంగళవారం నిరసన చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

జడ్పీలో బదిలీ చిచ్చు

- ఛైర్మన్.. సీఈవో మధ్య వివాదం
- వేర్వేరుగా ఎంపీడీవోల జాబితా రూపకల్పన

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : మండల అభివృద్ధి అధికారుల (ఎంపీడీవో) బదిలీ ప్రక్రియ చిచ్చు పెట్టింది.. జిల్లా పరిషత్ అధ్యక్షుడు (ఛైర్మన్) పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డిలు ఎవరికి వారు వేర్వేరుగా జాబితాలు రూపొందించారు.. తాము నిర్ణయించిన పేర్లే ఖరారు కావాలంటూ ఇద్దరూ భీష్మించుకోవడంతో సమస్య ముదిరి పాకాన పడింది.. 40 మందితో కూడిన జాబితాను సోమవారం రాత్రి 11 గంటలకు జడ్పీ ఛైర్మన్ విడుదల చేశారు. 42 మందితో ఉన్న జాబితాను సీఈవో విడుదల చేశారు. రెండు జాబితాలు విరుద్ధంగా ఉండటం.. కొలిక్కిరాకపోవడంతో ఎంపీడీవోల బదిలీలకు ఆటంకం ఏర్పడింది. అధికారులు రూపొందించిన జాబితాను ఛైర్మన్ పక్కన పెట్టడంపై 'కూటమి' నేతలు మండిపడుతున్నారు.

పేరు	సీఈవో ప్రతిపాదన	ఛైర్మన్ ప్రతిపాదన
చంద్రశేఖర్	పాములపాడు	గోనెగండ్ల
వెంకటరమణ	బనగానపల్లి	పెద్దకడబూరు
ఫజుల్ రహమాన్	బేతంచెర్ల	డోన్
షేక్ అమానుల్లా	ఆలూరు	రుద్రవరం
సుమిత్రమ్మ	మంత్రాలయం	పాములపాడు
పుల్లయ్య	నందవరం	బనగానపల్లి
వరప్రసాద్‌రావు	కోవెలకుంట్ల	కోసిగి
భాగ్యమ్మ	రుద్రవరం	నందవరం
సోల్‌మన్	సంజామల	ఉయ్యాలవాడ

ఎంపీడీవోల బదిలీలకు సంబంధించి గత పది రోజులుగా జడ్పీ ఛైర్మన్, సీఈవో, ఉప సీఈవో కసరత్తు చేశారు. కొన్ని మండలాలకు తనకు నచ్చిన పేర్లు ఎలా ప్రతిపాదిస్తారు.. తన అనుమతి లేకుండా జాబితా ఎలా తయారు చేస్తారంటూ జడ్పీ ఛైర్మన్ ప్రశ్నించడంతో గత రెండు రోజులుగా వారిద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలకే ప్రాధాన్యమిస్తున్నారు.. తాను ప్రతిపాదించిన పేర్లను సీఈవో పట్టించుకోవడం లేదని ఛైర్మన్ మండిపడుతున్నారు. అధికార పార్టీ నేతలకు విలువ ఇవ్వకుండా తాను ఎలా బాధ్యతలు నిర్వర్తించగలనని.. ఛైర్మన్ ప్రతిపాదించిన కొన్ని పేర్లను అంగీకరించి జాబితాలో చేర్చామని సీఈవో పేర్కొంటున్నారు.

ఛైర్మన్ జాబితాలో లేని ఎంపీడీవోల వివరాలు

- జి.వెంగన్న బేతంచెర్ల నుంచి కొలిమిగుండ్ల
- జి.వెంకటేశ్వరరెడ్డి అవుకు నుంచి డోన్
- మణిమంజరి మంత్రాలయం నుంచి గోనెగండ్ల

నవోదయలో ప్రవేశాలకు గడువు పెంపు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్షల దరఖాస్తుకు గడువు పెంచినట్లు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ పద్మావతి మంగళవారం తెలిపారు. ఆసక్తి కలవారు అక్టోబరు 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అందని బిల్లులు అంగన్‌వాడీల తిప్పలు

అంగన్‌వాడీలు అప్పు చేసి బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. గత మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కేంద్రాల్లో చిన్నారులకు మధ్యాహ్నం భోజనం వండి పెట్టేందుకు కూరగాయలు, పోపు దినుసులు, గ్యాస్ ఖర్చులకు కలిపి ప్రభుత్వం ఒక్కో చిన్నారికి నిత్యం రూ.2 చొప్పున చెల్లిస్తుంది. గత మూడు నెలలుగా రూ.36 లక్షలకు పైగా రావాల్సి ఉంది. జిల్లాలో 1,022 కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. మూడు నెలలుగా అద్దె బిల్లు రావడం లేదు.. రూ.కోటికి పైగా బకాయిలు పేరుకుపోయాయి. బిల్లులు సక్రమంగా రాక కేంద్రాల నిర్వహణ కష్టంగా మారింది.. అప్పు చేసి భోజనం అందిస్తున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పేర్కొంటున్నారు. విద్యుత్తు బిల్లులు తామే చెల్లిస్తున్నామని వాపోతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న విద్యార్థులు – న్యూస్‌టుడే నంద్యాల రైతునగరం

అంగన్‌వాడీ కేంద్రాలు	1,663
బాలింతలు	11,997
గర్భిణులు	12,619
మూడేళ్ల లోపు చిన్నారులు	73,941
3- 6 ఏళ్లలోపు పిల్లలు	46,080

దంపతుల విరాళం.. కన్నయ్యకు దివ్యాలయం


6లో

కొర్రవడిన ధర

రైతుల వెలవిల

డోన్, న్యూస్‌టుడే: జీవనశైలిలో మార్పులొచ్చాయి.. ఆహారపు అలవాట్లు మారుతున్నాయి.. తినే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా ప్రజలు జాగ్రత్తలు తీసుకొంటున్నారు.. కొర్రలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. సాగు పెంచేందుకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది.. ఫలితంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చిరు ధాన్యాల సాగు మూడింతలు పెరిగింది. ఒక్క డోన్ డివిజన్‌లో కొర్ర సాగు సాధారణం 1,306 హెక్టార్లు కాగా ఈసారి 1,849 హెక్టార్లలో సాగు చేశారు. అంతర పంటగా సాగు చేసిన పొలాల్లో ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పూర్తిస్థాయిలో సాగు చేసిన పొలాల్లో 10 క్వింటాళ్ల వరకు చేతికొచ్చింది. ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చినా ధర లేకపోవడంతో కొర్ర సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగు (హెక్టార్లలో)	కర్నూలు	నంద్యాల
సాధారణం	1,684	1,817
గతేడాది	1,499	7,201
ప్రస్తుతం	6,168	7,409



పంటను కోసి కుప్పగా పోశారిలా

కొర్రల విక్రయానికి మార్కెటింగ్ సౌకర్యం లేదు.. కొనుగోలు కేంద్రాలు ఎక్కడా ఏర్పాటు చేయలేదు.. కర్నూలు పెద్ద మార్కెట్లో మినహా ఎక్కడా కొనుగోలు చేయడం లేదు. దీన్ని దళారులు ఆసరా తీసుకొని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది క్వింటా రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.2500 నుంచి రూ.2600 పలుకుతోంది. మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం దళారులు చెప్పిన ధరకే ఇవ్వాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా కొర్ర సాగుకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు ఖర్చవుతోంది.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు విన్నవిస్తున్నారు. "రెండెకరాల్లో కొర్ర సాగు చేశా. రూ.12 వేలు ఖర్చు అయ్యింది. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. గతేడాది ధరలు బాగుండటంతో ఎంతో ఆశతో సాగు చేశా. ఈ ఏడాది క్వింటా రూ.2500 నుంచి రూ.2600 పలుకుతోంది. ఆ ధరకు విక్రయిస్తే నష్టాల పాలు కావాల్సిందేనని" కేకే కొట్టాలకు చెందిన సాలన్న ఆవేదన వ్యక్తం చేశారు.

జగన్ రాజీనామా చేసి మళ్లీ గెలవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : తన పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానంలో అక్రమాలు జరగలేదని జగన్‌మోహన్‌రెడ్డి నమ్మితే పులివెందుల ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో గెలవాలని మాజీ ఎమ్మెల్యే భైరెడ్డి రాజశేఖరరెడ్డి సవాల్ విసిరారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆదేశిస్తే వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో పులివెందులలో జగన్‌పై తానే పోటీ చేస్తానని చెప్పారు. నంద్యాలలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో భైరెడ్డి మాట్లాడారు. జగన్ పాలనలో తితిదేలో జరిగిన ఆస్తుల దోపిడీ, అపవిత్రతపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

హామీల అమలు కోరుతూ నేడు థాళీ బజావో

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం థాలీ బజావో (పళ్లెను గంటెలతో వాయిస్తూ నిరసన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహ యాదవ్ తెలిపారు. నంద్యాల కలెక్టరేట్ ఎదుట చేపట్టే ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని మంగళవారం ఆయన కోరారు. తెదేపా, జనసేన, భాజపా కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి వంద రోజులైనా అమలు చేయలేదని విమర్శించారు.



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

రేవనూరు దర్గా హుండీ లెక్కింపు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో ఉన్న హజ్రత్‌స్వామి దర్గాలో హుండీని మంగళవారం లెక్కించారు. ఏడాదికిపైగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.22.63 లక్షల ఆదాయం వచ్చింది. వక్ఫ్‌బోర్డు నంద్యాల ఇన్‌స్పెక్టర్ పాషావలి, కర్నూలు జిల్లా ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, డీఎం ఆష్ఫాక్, సభియా పర్వీన్, రేవనూరు ఎస్సై భాషా, ముత్తవలి గఫార్‌మియా పాల్గొన్నారు.

దంపతుల విరాళం.. కన్నయ్యకు దివ్యాలయం

- హోసూరులో శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణం
- వృద్ధుల విరాళంతో పుంజుకున్న పనులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆ దంపతులు మలివయస్సులోనూ మంచి నిర్ణయం తీసుకున్నారు. డబ్బు ఉన్నా.. సాయం చేసే మనసు అందరికీ ఉండదు. అలాంటి వీరికి కోట్ల ఆస్తులేమీ లేవు. కానీ సాయం చేయాలనే మనసు ఉంది. తండ్రి వారసత్వంగా వచ్చిన కొంత పొలం తప్ప ఇతర ఆదాయ మార్గాలేవీ లేవు. వయసు మీదపడింది. ఊరికి ఏదో మంచి చేయాలని సంకల్పించారు. ఆలయ నిర్మాణానికి లక్షల విరాళంగా ఇచ్చారు. గ్రామంలో ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు వృద్ధ దంపతులు మాలగొండ రోశన్న, జయమ్మ దంపతులు.



శిథిలావస్థలో వారి ఇల్లు

ఏళ్ల తరబడి ఎదురు చూపులు

రోశన్న, జయమ్మ దంపతులకు వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఉన్న ఎనిమిదెకరాల్లో ఐదెకరాల పొలాన్ని రూ. 90 లక్షలకు విక్రయించారు. వచ్చిన దాంట్లో గ్రామంలో శ్రీకృష్ణాలయ నిర్మాణానికి రూ. 65 లక్షల విరాళం అందించారు. వారు అందించిన భారీ విరాళంతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. యాదవులు అధికంగా ఉన్న హోసూరులో వారి ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణాలయం నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆర్థిక వనరులు సమకూరక ఇబ్బందులు పడుతున్న యాదవ సంఘం పెద్దలకు తామున్నామని ముందుకొచ్చారు వృద్ధ దంపతులు.



హోసూరులో నిర్మిస్తున్న శ్రీకృష్ణాలయం

ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోంది

- మాలగొండ రోశన్న, జయమ్మ, దాతలు



ఎన్నో ఏళ్లుగా గ్రామంలో శ్రీకృష్ణుడి ఆలయం నిర్మించాలని సంఘం పెద్దలు అనుకుంటున్నారు. అది కార్యరూపం దాల్చలేదు. ఆలయ నిర్మాణం అంటే రూ. లక్షల్లో వ్యవహారం. వారు వీరు ఇచ్చే వేల రూపాయలు ఏ మూలకూ సరిపోవు. ఎన్ని ఆస్తులున్నా, ఎంత డబ్బు ఉన్నా ఎవరూ వెంట తీసుకెళ్లలేరు. గ్రామంలో ఓ ఆలయం రూపుదిద్దుకొని, ఆధ్యాత్మిక భావాలు పెంపొందుతాయంటే.. అంత కన్నా మనకెంతో ఆనందం ఏముంటుంది. అందుకనే నా భార్య జయమ్మతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నాం.


భూమిని నమ్ముకొనే జీవనం

పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన మాల గొండ రోశన్న, జయమ్మ దంపతులకు సంతానం లేదు. రోశన్నకు ఉన్న ఇద్దరు సోదరులు వేరువేరుగా ఉంటారు. వారి భాగానికి వచ్చిన 12 ఎకరాల పొలాన్ని నమ్ముకొని ఇన్నాళ్లు జీవనం సాగించారు. ప్రస్తుతం ఏడు పదుల వయసులో ఉన్న ఈ దంపతులు ఏ పనీ చేయలేక పోతున్నారు. కొన్నేళ్ల భూమిని కౌలుకు ఇచ్చి వచ్చిన డబ్బుతో కాలం గడుపుతున్నారు. కొంత కాలంగా ఇద్దరిని జబ్బులు వెంటాడుతున్నాయి. చికిత్స నిమిత్తం రూ. లక్షలు ఖర్చు చేశారు. మధ్యలో కొంత పొలాన్ని అమ్మి అప్పులు తీర్చారు. ఇటీవల మరికొంత అమ్మగా వచ్చిన సొమ్ములో కొంత వారితో ఉంచుకొని రూ. 65లక్షలు పైగా ఆలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. శిథిలావస్థకు చేరిన తమ సొంత ఇంటిని సైతం మరమ్మతులు చేసుకోకుండా ఆలయ నిర్మాణానికి విరాళం ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. భర్త రోశన్న తీసుకున్న నిర్ణయానికి భార్య జయమ్మ సైతం సుముఖత వ్యక్తం చేసి ఆదర్శ దంపతులుగా నిలిచారు. వృద్ధ దంపతులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం దాత రోశన్న దగ్గర ఉండి ఆలయ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు.

చేజారనివ్వరు

- సెల్‌ఫోన్ రికవరీల్లో సైబర్‌ల్యాబ్ కీలకపాత్ర
- వేల సంఖ్యలో బాధితులకు అప్పగింత

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: చరవాణి.. ఇది నిత్యం ప్రతి మనిషి వెన్నంటే ఉండే ఎలక్ట్రానిక్ ఉపకరణం. బ్యాంకు ఖాతా మొదలుకొని వ్యక్తిగత, రహస్య సమాచారం నిక్షిప్తం చేసుకునే వేదికగా ఎలక్ట్రానిక్ డైరీగా, ల్యాప్‌టాప్‌గా, టీవీగా.. ఇలా పలు విధాలుగా ఉపయోగపడుతోంది. నగదు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా అంతర్జాల సేవలతో ఒకరికొకరు పంపుకొనే సౌకర్యముంది. అలాంటి చరవాణి అపహరణకు గురైనా.. ఎక్కడైనా పోగొట్టుకున్నా కలిగే బాధ వర్ణనాతీతం. ప్రస్తుతం చరవాణి దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల సంఖ్యలో అపహరణకు గురవుతున్నాయి. ఫలితంగా ఎందరో బాధితులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అలాంటి వారికి సాంత్వన కలిగించేలా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ఏటా వందల సంఖ్యలో చరవాణులను రికవరీ చేసి అప్పగిస్తున్నారు. బాధితులు ఆన్‌లైన్ ద్వారా పంపే వివరాలతో పోలీసులు దర్యాప్తు చేపట్టి చరవాణి గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు.



మేళా ద్వారా బాధితులకు అందజేసిన చరవాణుల వివరాలు

సం.	నెల	రికవరీ
2023	జనవరి	1,042
2023	జూన్	652
2023	నవంబర్	652
2024	సెప్టెంబర్	587

సాంకేతిక పరిజ్ఞానంతో..

చరవాణుల రికవరీలో కర్నూలు జిల్లా కేంద్రంలోని రీజనల్ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ సాంకేతిక నిపుణులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బృంద సభ్యులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి చరవాణిని ఎవరు ఉపయోగిస్తున్నారో గుర్తించి వారి నుంచి రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న వ్యక్తుల నుంచి సైతం చరవాణులను రికవరీ చేస్తుండటం విశేషం. ఎవరైనా చరవాణులు పోగొట్టుకున్న బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ బిందుమాధవ్ పేర్కొంటున్నారు.

చోరీకి గురైతే ఏం చేయాలి..

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు http:kurnoolpolice.in/mobiletheft లింకుపై క్లిక్ చేయాలి. తెరపై కనిపించే దరఖాస్తులో పేరు, చిరునామా, చరవాణి నంబరు, స్థానిక పోలీసుస్టేషన్, ఐఎంఈఐ నంబరుతో సహా అవసరమైన వివరాలు నమోదు చేయాలి.



డిపో ఆవరణలో మొక్క నాటుతున్న డీపీటీవో రజియా సుల్తానా

కార్మికుల ఐక్యతతోనే అభివృద్ధి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల ఐక్యతతో ఉండి సమష్టి కృషి చేస్తే ఆర్టీసీ డిపోలు అభివృద్ధి చెందుతుంది సాధ్యమవుతుందని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారిణి రజియా సుల్తానా పేర్కొన్నారు. డోన్ ఆర్టీసీ డిపోను ఆమె మంగళవారం సందర్శించారు. డిపో గ్యారేజీలోని స్టోర్, ఎంఎంప్ రూమ్, డీజిల్ షెడ్డు, గ్యారేజీలో బస్సులకు కార్మికులు చేపడుతున్న మరమ్మతులు తదితర వాటిని ఆమె పరిశీలించారు. పలు విషయాలను ఆయా విభాగాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బస్సుల కండిషన్‌లో ఉండేలా చూడాలని గ్యారేజ్ సిబ్బందికి సూచించారు. ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. స్వచ్ఛతా సేవ కార్యక్రమంలో భాగంగా డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ మెజెస్, జిలానీ, గ్యారేజ్ లీడింగ్ హ్యాండ్ గోపాల్, యూనియన్ నాయకులు సీతారామిరెడ్డి, వీరారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పొంగిన వాగులు, వంకలు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం మోస్తారు వర్షం కురిసింది. దీంతో పలు వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. పసుపల గ్రామ శివారులోని గుండం మల్లికార్జునస్వామి ఆలయ సమీపంలో జలపాతం కనువిందు చేసింది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షం పడటంతో జలపాతం వచ్చింది. దీంతో పసుపల చెరువుకు నీరు చేరింది.



పసుపల గుండం మల్లికార్జునస్వామి ఆలయం వద్ద దూకుతున్న జలపాతం

అవుకు జలాశయంలో పెరిగిన నీటిమట్టం

అవుకు, న్యూస్‌టుడే: నీటిమట్టం ఒక్కసారిగా పెరగడంతో అవుకు జలాశయం నిండు కుండలా మారింది. మొన్నటి వరకు మూడు టీఎంసీలకే పరిమితమైన నీటి నిలువను నాలుగు టీఎంసీలకు పెంచారు. అవుకు జలాశయంలో 4.18 టీఎంసీల నీటి నిలువచేసే అవకాశం ఉంది. శ్రీశైలం జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం చేరడంతో గాలేరు నగరి వరద కాలువ ద్వారా ప్రవాహాన్ని పెంచారు. ప్రస్తుతం గోరుకల్లు అవుకు జలాశయానికి 12,500 క్యూసెక్కులు చేరుతుండగా ఇదే స్థాయిలో వైఎస్సార్ జిల్లా గండికోట జలాశయానికి నీటిని వదులుతున్నారు. ఎస్సార్బీసీ 13 ప్యాకేజీ కాల్వలకు 300, అవుకు కాల్వలకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఈఈ సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు.



నిండు కుండలా మారిన అవుకు జలాశయం

కూటమి పాలనలో ప్రజలకెంతో మేలు

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజలకెంతో మేలు జరిగిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. ఉయ్యాలవాడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంగళవారం ఆమె పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశారని వివరించారు. ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీకి స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా రూ. 6.80 లక్షలతో మంజూరు చేసిన ట్రాక్టర్‌ను ఆమె ప్రారంభించారు. మొక్కలు నాటడం, గర్భిణులకు శ్రీమంతం చేశారు. మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖరరెడ్డి, సర్పంచి ఓబులేసు, మండల నాయకులు పి.రామ్మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, నర్సిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నారాయణ యాదవ్, అనంతా కళాశాల వ్యవస్థాపకుడు రామసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ నీటి సంఘం అధ్యక్షుడు ఆకుల వెంకట సుబ్బయ్య, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



గోడపత్రాలు విడుదల చేస్తున్న అఖిలప్రియ

నల్లమల దారిలో లారీ బోల్తా

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే: నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఇటుకల వంతెన సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఉల్లిగడ్డల లోడుతో వెళుతున్న ఓ లారీ ఢీకొని బోల్తాపడింది. గాయపడిన డ్రైవరును నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఇటుకల వంతెన కింద ఇరుకైన మార్గంలో లారీ బోల్తా పడటంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కార్లు, ఆటోలు, జీపులు మాత్రమే వెళ్లేందుకు దారి ఉండటంతో లారీలు, బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉదయం నుంచి వందలాది వాహనాలు నిలిచిపోయాయి. మధ్యాహ్నమైనా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆకలితో ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు, క్లీనర్లకు గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి అన్న క్యాంటీన్ నుంచి భోజనాలు పంపించారు. బస్సులు నిలిచిపోవడంతో వాటిలోని ప్రయాణికులు ఆటోలు ఇతర చిన్న వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఉదయం నుంచి లారీని తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఎట్టకేలకు రాత్రి 10 గంటల తర్వాత రాకపోకలను పునరుద్ధరించారు.



ఇటుకల వంతెన వద్ద బోల్తాపడిన లారీ

అక్రమ కట్టడాలపై అధికారుల సర్వే

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామంలో కొంతమంది కుంటలో అక్రమంగా ఇళ్లను నిర్మించుకోవడంపై జిల్లా కలెక్టర్ జి.రాజకుమారికి ఫిర్యాదు చేశారు. దీనిపై మంగళవారం అధికారులు గ్రామానికి వెళ్లి గ్రామస్థులను విచారించి కుంట స్థలంలో కొలతలు నిర్వహించారు. సర్వే నంబరు 307లో 1.29 ఎకరాలు, సర్వే నంబరు 308లో 8.80 ఎకరాలు కుంట స్థలం ఉంది. సర్వే నంబరు 307లో వైకాపాకు చెందిన ఓ వ్యక్తి సుమారు 3 సెంట్లలో ఇంటిని నిర్మించుకున్నారు. సర్వే నంబరు 308లో వైకాపాకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు చెరో 3 సెంట్ల చొప్పున ఇళ్లను నిర్మించుకున్నారు. ఇలా సుమారు 20 సెంట్ల మేర ఆక్రమణ జరిగినట్లు కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో సయ్యదున్నీసా, ఈవోఆర్డీ రాధిక, మైనర్ ఇరిగేషన్ డీఈ భాస్కర్, జేఈ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై మల్లికార్జున రెడ్డి, సర్వేయర్, వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులతో కుంట స్థలాన్ని పరిశీలించి సర్వే చేయించారు. నివేదికలను ఆర్డీవో ద్వారా కలెక్టర్‌కు పంపిస్తామని తహసల్దార్ పేర్కొన్నారు.



కుంట స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ట్రాక్టరు ఢీకొని వ్యక్తి మృతి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల మండలం హెచ్ కొట్టాల సమీపంలో ట్రాక్టరు ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బేతంచెర్ల శ్రీనగర్ కాలనీకి చెందిన రాజు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు శ్రీనివాసులు(23), గణేశ్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై ముచ్చట్ల మల్లికార్జున స్వామి వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ముచ్చట్ల క్రాస్ రోడ్డు వద్ద అటువైపు వెళ్తున్న ట్రాక్టరు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసులు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు గణేశ్ తీవ్ర గాయాలు కావడంతో బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



శ్రీనివాసులు (పాతచిత్రం)

ప్యాపిలి సమీపంలో కోడి పందేలు

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్యాపిలి సమీపంలోని పెద్దమ్మ దేవాలయం వద్ద కోడి పందెలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్సై మధుసూదన్ మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 4530 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల
• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టరు


వీఆర్వోలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టరు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని జాయింట్ కలెక్టరు విష్ణుచరణ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. ఫ్రీహోల్డ్ భూముల రికార్డు నమోదులో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీవో దాసు, తహసీల్దారు ఆల్ఫ్రేడ్, ఉప తహసీల్దారు హరిత, పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల కేఎన్ఎం పురపాలక పాఠశాల ఆవరణలో బుధవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బాలబాలికలకు అండర్-14, 17 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రోబాల్, ఫెన్సింగ్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: సమస్య : నంద్యాల ఆర్టీసీ బస్టాండులో తాగునీరు ఉప్పగా వస్తున్నాయి. **- నాయుడు, నంద్యాల**

సమాధానం : మంచినీరు అందించేలా చర్యలు తీసుకుంటాం **- గంగాధర్‌రావు ఆర్టీసీ డీఎం.**

సమస్య : జుమ్మా మసీదు ప్రాంతంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. **- సురేశ్ స్థానికుడు**

ఆకస్మికంగా ఆరోగ్య కేంద్రాలు తనిఖీ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల మండల పరిధిలోని మద్దూరు, చాపిరేవుల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి డా. వెంకటరమణ


వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి డా.వెంకటరమణ

మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని దస్త్రాలను పరిశీలించి, వార్డులను, ల్యాబ్‌లను, వ్యాధి నిరోధ కాలను తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో జరిగే సెక్టార్ సమావేశంలో పాల్గొని సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, పర్యవేక్షకులు విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం జాబితాలో ఆర్జీఎం అధ్యాపకులు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయం స్టాన్‌ఫోర్డు విడుదల చేసిన ప్రతిభ గల శాస్త్రవేత్తల జాబితాలో నలుగురు ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు స్థానం లభించినట్లు కళాశాల ఛైర్మన్ శాంతిరాముడు తెలిపారు. మంగళవారం జాబితాలో చోటు దక్కించుకున్న అధ్యాపకులను కళాశాలలో అభినందించారు.

ఖాళీ స్థలాలు.. అధికారులకు కాసులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) మున్సిపాలిటీకి అత్యధిక ఆదాయం తెచ్చిపెడుతుంది. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారంతో పాటు, నిలిచిన మురుగునీటిని తొలగించడానికి, స్థలం నిర్వహణ యజమాని నుంచి వసూలు చేసే పన్ను ఇది. మొత్తం స్థలం విలువలో ఒక శాతాన్ని ట్యాక్సు రూపంలో వసూలు చేస్తారు. నంద్యాల పట్టణంలో మాత్రం మున్సిపాలిటీ అధికారులు కొన్ని స్థలాలకు మాత్రమే పన్నును వసూలు చేస్తున్నారు. మరికొన్ని స్థలాలకు పన్నులు వేయకుండా యజమానులతో అధికారులు లోపాయికారి ఒప్పందం చేసుకుని ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


పార్థసారధి నగర్‌లోని ఈ ఖాళీ స్థలాలకు ఇంత వరకు పన్ను వేయలేదు

సమన్వయ లోపమే కారణం

నంద్యాల జిల్లా కేంద్రం 32 చదరపు కి.మీ విస్తరించి ఉంది. నూతనంగా చేరిన రైతునగరం, పొన్నాపురం, ఉడుమాల్పురం గ్రామ పంచాయతీలు కలిపి మొత్తం 42 మున్సిపాలిటీ వార్డులతో పాటు 30 రెవెన్యూ వార్డులు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని శివారు కాలనీలు, గ్రామ పంచాయతీల పరిధిలో ఖాళీ స్థలాలు పెద్దఎత్తున ఉన్నాయి. ఎక్కువ మొత్తంలో ఖాళీ స్థలాలు ఉన్నా వీఎల్‌టీ పన్ను మాత్రమే నామమాత్రంగానే వసూలు అవుతుంది. పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం కూడా పన్ను వసూలు తగ్గడానికి కారణంగా తెలుస్తోంది.

అనుకుంటే పన్ను.. లేకపోతే లేదు

కుడా పరిధిలోని లే-అవుట్లు పరిశీలించడానికి వెళ్లిన సమయంలో గుర్తించిన కొన్ని రకాల ఖాళీ స్థలాల్లో మాత్రమే పట్టణ ప్రణాళిక విభాగం వీఎల్‌టీ పన్నులు వేస్తుంది. కుడా పరిధిలోనే రైతునగరంలో 52 లేఅవుట్లు ఉన్నా వీటి నుంచి ఖాళీ స్థలాల పన్నులు మాత్రం వసూలు కావడంలేదు. కొంత మంది అధికారులు సిబ్బంది స్థలాల యజమానులతో ఒప్పందం చేసుకుని వీఎల్‌టీ పన్నులకు ఎగనామం పెడుతున్నారు. కొంత మంది అధికారులు పద్మావతినగర్ లాంటి వాణిజ్య ప్రాంతంలో కమర్షియల్ పరిధిలోకి వచ్చే స్థలాలకు, రెసిడెన్సియల్ కింద పన్ను వేసి మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. బాలాజీ కాంప్లెక్స్, ఎస్బీఐ కాలనీ, ఎన్జీవో కాలనీలో కూడా కమర్షియల్ పన్ను విధించకుండా రెసిడెన్సియల్ పన్ను విధించి కొంత మంది సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.

గుర్తింపులోనే నిర్లక్ష్యం

వీఎల్‌టీ పన్ను వసూళ్లు ఇలా

ఆర్థిక సంవత్సరం	వసూలు చేసిన పన్ను
2022-23	రూ. 82 లక్షలు
2023-24	రూ. 97 లక్షలు
2024-25	రూ. 62 లక్షలు

మున్సిపాల్టీ పరిధిలోని ఎస్బీఐ కాలనీ, ఎన్జీవో కాలనీ, బాలాజీ కాంప్లెక్స్, సాయిబాబానగర్, నౌమాన్ నగర్, ఎస్సార్బీసీ కాలనీ, నందమూరి నగర్, వైఎస్సార్‌నగర్, కాంతినగర్, విజయనగరం, రైతునగరం, చాబోలు రహదారి, పొన్నాపురం కాలనీ, హౌసింగ్ బోర్డు, ఉడుమాల్పురం, వెంకటేశ్వరపురం, ఆటోనగర్, ప్రథమనంది ఆలయం సమీపంలో, హనీఫ్‌నగర్, శ్యాంనగర్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయి. కానీ పన్ను వసూళ్లు మాత్రం జరగడం లేదు. పద్మావతినగర్, నూనెపల్లె, విద్యానగర్ లాంటి కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఖాళీ స్థలాలకు పూర్తి స్థాయిలో పన్ను వసూలు చేస్తున్నారు. జగజ్జననీ నగర్, పరశురామ్‌నగర్ లాంటి ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఖాళీ స్థలాలను గుర్తించకపోవడం గమనార్హం. ఈ ప్రాంతాల్లో మున్సిపాలిటీ అధికారులు పన్నులు వేయకుండా నిలువరించడంలో కొంత మంది నాయకులు, అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎంపీడీవోగా వాసుదేవగుప్తా

గడివేముల, న్యూస్‌టుడే : గడివేముల ఎంపీడీవోగా వాసుదేవగుప్తా నియమితులయ్యారు. స్థానికంగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ప్యాపిలి మండలానికి బదిలీ అయ్యారు.

మిడుతూరు, న్యూస్‌టుడే : మిడుతూరు మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా దశరథరామయ్య బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జీఎన్ఎస్‌రెడ్డి బదిలీపై కల్లూరు మండలానికి వెళ్లారు.

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలం నూతన ఎంపీడీవోగా ఎండీ మహ్మద్‌దౌలా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న రాముడును నంద్యాల క్వాలిటీ కంట్రోల్ కార్యాలయానికి బదిలీ చేయడం జరిగింది.

సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి


మొక్కలకు నీళ్లు పోస్తున్న అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎన్.శశికళ పేర్కొన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డా.రామలింగారెడ్డి, డా.విజయానంద్, పీడీ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

తెదేపా పాలనలోనే గ్రామాభివృద్ధి


బైరెడ్డి రాజశేఖరరెడ్డి సమక్షంలో తెదేపాలో చేరిన వైకాపా నాయకులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : తెదేపా పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. నంద్యాలలో మంగళవారం స్థానిక ఎంపీ డా.బైరెడ్డి శబరి కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాణ్యం మండలంలోని మద్దూరు, గోనవరం, నెరవాడ, భూపనపాడు గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు వైకాపాను వీడి బైరెడ్డి రాజశేఖరరెడ్డి సమక్షంలో తెదేపాలో చేరారు. వైకాపాను వీడి తెదేపాలో చేరిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మద్దూరు గణపం పుల్లారెడ్డి, పాణ్యం పుల్లారెడ్డి, గోరుకలు ఎరుకలయ్య, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి, నంద్యాల తెదేపా నాయకులు నరహరి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పగిడ్యాల న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని బీసీ కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అంటించి ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమానికి హాజరయ్యారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సేంద్రియ వ్యవ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య,

సాయంతో పండించిన కూరగాయాల పంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, పలచాని మహేశ్వరరెడ్డి, పుల్యాల వాసురెడ్డి, దామోదర్ రెడ్డి, జనసేన నాయకుడు రవికుమార్ , మండల అధికారులు, పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు సత్కారం


క్రీడాకారులను అభినందిస్తున్న కళారాధన, లయన్స్‌క్లబ్ సభ్యులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలకు చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులు పల్లవి, రాజు, మహేశ్, లక్ష్మీనరసింహలను మంగళవారం స్థానిక కళారాధన కార్యాలయంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా. రవికృష్ణ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 14, 15వ తేదీలలో అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అక్టోబరులో గోవాలో జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, కళారాధన సభ్యులు రమణయ్య, బాలచంద్రుడు, రామచంద్రుడు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవు


పెసరవాయి గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న ఎస్సై నాగార్జునరెడ్డి, సిబ్బంది

గడివేముల న్యూస్‌టుడే : ఫ్యాక్షన్ గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగార్జునరెడ్డి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా ఆదేశాల మేరకు పెసరవాయి గ్రామంలో ఎస్సై నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, సలాం పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల మండల పరిధిలోని సుగాలి మెట్టవద్ద మంగళవారం ప్రమాదవశాత్తు టిప్పర్ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో విద్యుత్తు నియంత్రిక వద్ద ఫీజు పోయి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని తమ్మరాజుపల్లె సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం తెలంగాణ ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న క్యాంపర్‌ను ఢీ కొట్టి డివైడర్ పైకి ఎక్కినట్లు ఎస్సై నరేంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు. . బస్సుల్లో 20మంది ప్రయాణికులు ఉన్నా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అకాల వర్షం.. అన్నదాతల కలవరం

ఈ ఏడాది మొక్కజొన్న రైతులకు కాలం కలిసిరాలేదు. రైతులు అష్టకష్టాలు పడి కొద్దిపాటి పంటను కాపాడుకున్నారు. పండిన పంటను మొక్కజొన్నలను కల్లాలు, ఖాళీ స్థలాల్లో ఆరబోశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం పడగానే దిగుబడులపై పట్టలు కప్పుతున్నారు. ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న దిగుబడులపై కప్పిన పట్టలపై పెద్దఎత్తున నీరు నిలిచింది. దీనివల్ల గింజల్లో తేమ శాతం పెరుగుతోందని ఆందోళన చెందుతున్నారు.

- న్యూస్‌టుడే, ఆత్మకూరు, నందికొట్కూరు గ్రామీణం


ఎదురుపాడు వద్ద వర్షం నీటిని తొలగిస్తున్న రైతులు


కరివేన శివారులో మొక్కజొన్నలు ఆరబెట్టుకుంటూ..

సస్యరక్షణతోనే అధిక దిగుబడి

వెలుగోడు, న్యూస్‌టుడే : పంటల సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో పవనన్‌కుమార్ సూచించారు. వెలుగోడు మండలంలోని గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జొన్నపంటను పరిశీలించి కత్తెరపురుగు, లద్దెపురుగు నివారణ చర్యలు వివరించారు.

శిరస్త్రాణం తప్పక ధరించాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించడంతో పాటు రహదారి భద్రతా నియమాలు పాటించాలని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. పట్టణ శివారులో మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణం శివారులోని శమీ వృక్షం వద్ద భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేసిన ఏర్పాట్లను పురపాలక ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి, ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయనున్నట్లు ఛైర్మన్ సుధాకరరెడ్డి తెలిపారు.

వంటవాళ్లను తొలగించడం అన్యాయం

మిడుతూరు న్యూస్‌టుడే : దువనూరు ఉన్నత పాఠశాలలో పాతికేళ్లుగా వంట పని చేస్తున్న వారిని తెదేపా నాయకులు తొలగించడం అన్యాయమని మండల వ్యకాస నాయకులు ఫక్కీర్ సాహెబ్, ఓబులేసు అన్నారు. వంట మనుషులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం ఎంపీడీవో జీఎన్ఎస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

జూపాడుబంగ్లా న్యూస్‌టుడే : మండలంలోని కనకయ్య కొట్టాల జడ్పీపాఠశాలలో 2004 - 2005 బ్యాచ్‌కి చెందిన 10వ తరగతి విద్యార్థి కాశిబోయిన వెంకట అశోక్ కుమార్ యాదవ్ రూ.40వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, స్పీకర్స్‌ను మంగళవారం పాఠశాలకు విరాళంగా అందజేశారు.

స్వర్ణాంధ్ర - 2047 ప్రణాళికలో భాగస్వాములవ్వాలి

మహానంది న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర - 2047 ప్లాన్‌లో భాగస్వాములు కావాలని ఈవోఆర్డీ శివనాగజ్యోతి కోరారు. ఎం.తిమ్మాపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం 'మీ విజన్ - మా మిషన్' పేరుతో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు.

సీమ సాగునీటి రంగాన్ని సత్వరమే గాడిలో పెట్టాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : శిథిలావస్థకు చేరుకున్న రాయలసీమ సాగునీటి రంగాన్ని సత్వరమే గాడిలో పెట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరిశోధనల ఫలాలు రైతులకు చేరాలి

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితాలు రైతులకు చేర్చాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం నంద్యాల మండలంలోని మునగాల, రాయమాల్పురంలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను పరిశీ


పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

లించి సాగులో వచ్చే తెగుళ్లు, నివారణపై రైతులకు వివరించారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరుతుందన్నారు. ఎంపీపీ శెట్టి ప్రభాకర్, సర్పంచి పార్వతమ్మ, ఏడీఏ రాజశేఖర్, ఏవో ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూభాషలోనే పరీక్షలు నిర్వహించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : ఉర్దూ


సమావేశంలో పాల్గొన్న నంద్యాల ముస్లిం ఐకాస నేతలు

మీడియం చదివిన విద్యార్థులకు 10వ తరగతి, ఇంటర్ పరీక్షలను ఉర్దూ మీడియంలోనే నిర్వహించాలని నంద్యాల ముస్లిం ఐకాసా గౌరవాధ్యక్షులు అబులైస్, అబ్దుల్ సమద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ముల్లాన్ పేటలోని ఖిద్మత్ బ్యాంకులో నంద్యాల ముస్లిం ఐకాస నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ సీబీఎస్ఈ పరీక్షలను కేవలం హిందీ, ఆంగ్ల భాషల్లోనే కాకుండా విద్యార్థులు తమ మాతృ భాషలో పరీక్షలు రాసే విధంగా అవకాశం కల్పించాలన్నారు. మైనార్టీ వర్గాల రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు జాతీయ మైనార్టీ కమిషన్‌తో పాటు సంబంధిత అధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు. జాకీర్, మునీర్ అహమ్మద్, అర్షద్, జకారియా, ఫయాజ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

పులి జాడ కనిపించలేదు

గడివేముల, న్యూస్‌టుడే : గడివేముల మద్దిలేరు వాగు పరిసరాల్లో పులి కాలిజాడలు కనిపించలేదని డిప్యూటీ రేంజ్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. గడివేములలోని మద్దిలేరు వాగు పరిసరాల్లో పులి, పులిపిల్ల సంచరిస్తున్నట్లు కొందరు యువకులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో డిప్యూటి రేంజ్ అధికారి విజయలక్ష్మి మంగళవారం ఉదయం వాగు పరిసరాల్లో పులిపాద ముద్రల కోసం గాలించారు. కొన్ని పాద ముద్రలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు.


పులి అడుగుల కోసం గాలిస్తున్న అటవీ సిబ్బంది

ల్యాబ్ రిపోర్టు ప్రకారం అడవిపిల్లి పాదముద్రలుగా గుర్తించినట్లు ఆమె తెలిపారు. గాలింపులో బీట్ అధికారి కమాల్ తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల సంస్థ సభ్యుడిగా మహేశ్

నందికొట్కూరు, న్యూస్‌టుడే : పగిడ్యాల మండలం వనుములపాడు గ్రామానికి చెందిన బోయ మహేష్ నాయుడుని తెదేపా అధిష్ఠానం సివిల్ సప్లైయ్ కార్పొరేషన్ సభ్యుడిగా ఎంపిక చేసింది. ఈయన 2019లో నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్తగా పనిచేశారు.

బరువులెత్తేస్తూ.. పతకాలు సాధిస్తూ


పతకంతో లక్ష్మీనరసింహ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తితో కుస్తీ, ఫుట్‌బాల్ ఆటలు నేర్చుకున్న లక్ష్మీనరసింహకు.. ఇంటర్ తర్వాత పవర్ లిఫ్టింగ్ క్రీడపై ఆసక్తి పెరిగింది. దీంతో జిమ్‌లో చేరి దేహ దారుఢ్యాన్ని పెంచుకోవడంతో పాటు పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకున్నాడు. పేదరికం ఇబ్బంది పెడుతున్నా.. పండ్ల దుకాణంలో పనిచేస్తూనే నిత్యం పట్టుదలతో సాధన చేస్తున్నాడు. పోటీల్లో సత్తా చాటుతూ పతకాలు సాధిస్తున్నాడు నంద్యాల యువకుడు.

☛ నంద్యాల పట్టణం హరిజనవాడకు చెందిన ఈశ్వరమ్మ, ఓబులేసు దంపతుల కుమారుడు లక్ష్మీనరసింహ. బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశాడు. క్రీడలపై ఆసక్తితో పాఠశాల స్థాయి నుంచి కుస్తీ, ఫుట్‌బాల్ ఆడేవాడు. ఇంటర్మీడియట్ నుంచి పవర్ లిఫ్టింగ్‌పై మక్కువ పెంచుకున్నాడు. వ్యాయామ శాలలకు వెళ్లి శిక్షణ తీసుకుంటూ.. నిత్యం కఠోర సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నాడు. ప్రస్తుతం పట్టణంలోని ఓ పండ్ల దుకాణంలో పనిచేస్తూనే.. ఉదయం, సాయంత్రం ఖాళీ సమయాల్లో జిమ్‌కు వెళ్లి బరువులు ఎత్తడం సాధన చేస్తున్నాడు. పవర్ లిఫ్టింగ్ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు లక్ష్మీనరసింహ చెబుతున్నాడు.

సాధించిన విజయాలు

☛ 2019లో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్యం గెలుపొందాడు.

☛ 2022లో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బంగారు పతకం అందుకున్నాడు.

☛ 2022 మహారాష్ట్రలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రశంసా పత్రం అందుకున్నాడు.

☛ 2023 సెప్టెంబరులో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో వెండి పతకం సాధించారు.

☛ 2023 నవంబరులో బెంగళూరులో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో కాంస్యం గెలుచుకున్నాడు.

☛ ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 59 కిలోల విభాగంలో వెండి పతకం సాధించాడు.

☛ అక్టోబరు నెలలో గోవాలో జరుగనున్న జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు.

చెరువులకు లీకులు.. పొలాలు బీళ్లు

పాణ్యం, పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : వేలాది ఎకరాలకు సాగు నీరందించే చెరువులను పట్టించుకోకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గత ప్రభుత్వం చెరువుల నిర్వహణ, మరమ్మతులకు నిధులు ఇవ్వకపోవడంతో చెరువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. సరైన సమయానికి చెరువు కట్టలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కట్టలు బలహీనపడి నీరు లీకేజీ అవుతుంది. నీరు ఎక్కువగా వచ్చినప్పుడు కొన్ని చోట్ల చెరువు కట్టలు తెగిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇప్పటికే కొన్ని చెరువులకు గండ్లు కూడా పడ్డాయి. దీంతో నీరు వృథాగా బయటికి వెళ్లిపోవడంతో చెరువు కింద ఆయకట్టు పొలాలకు నీరందక బీడుగా మారుతున్నాయి. కళ్ల ముందే నీరున్నా సరైన సమయానికి పంటలకు నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.



పాణ్యం నియోజకవర్గంలో చెరువుల పరిస్థితి అధ్వానంగా మారింది. పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం మండలంలో 6, గడివేముల మండలంలో 3 చెరువులు ఉన్నాయి. పాణ్యం మండలంలో పాణ్యం ఊరి ముందరి చెరువు కింద 327 ఎకరాలు, కొలమాకుల రిజర్వాయర్ (కొత్తచెరువు) కింద 200, కొండజూటూరు 207, ఆలమూరు 172, భూపనపాడు 450, వడ్డుగడ్ల చెరువు 127 ఎకరాలు ఆయకట్టు పొలం ఉంది. గడివేముల మండలంలో మంచాలకట్ట 2500 ఎకరాలు, గడిగరేవుల 100 ఎకరాల ఆయకట్టు పొలం ఉంది., గని చెరువు కింద ఆయకట్టు లేకపోవడంతో చెరువు నుంచి నీరు పారించుకుంటూ దాదాపు 200 ఎకరాల పొలం వరకు సాగు చేసుకుంటున్నారు.


కొండజూటూరు చెరువు కింద బీడుగా మారిన పొలాలు

మరమ్మతులు పట్టని అధికారులు

చెరువు నీరు లీకేజీ అవుతుండటంతో ఆయకట్టు పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. కొండజూటూరు చెరువు కట్ట కింద పొలాల్లో నీటి లీకేజీ ఎక్కువగా అవుతుండటంతో పొలాల్లోకి ట్రాక్టర్లు, యంత్రాలు దిగితే బురదలో దిగబడి పోతున్నాయి. దీంతో పంట సాగు కష్టంగా మారింది. 50 ఎకరాలకు పైగా జమ్ము, గడ్డి పెరిగిపోవడంతో పొలాలు బీళ్లుగా మారాయి. ఆలమూరు చెరువు నుంచి నీటి లీకేజీలు ఎక్కువై దాదాపు 200 ఎకరాల పొలం బీళ్లుగా మారింది. భూపనపాడు, కొండజూటూరు చెరువుల అలుగులకు రంధ్రాలు పడటం, భూపనపాడు, పాణ్యం చెరువుల తూముల నుంచి లీకేజీలు, ఆలమూరు చెరువు పెద్దతూముకు రంధ్రం పడటంతో నీరు వృథాగా పారుతూ వాగుల్లో కలుస్తోంది. ఆలమూరు చెరువు కట్టకు పగుళ్లు ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట సాగు కష్టంగా ఉంది - గంగయ్య, రైతు, కొండజూటూరు

చెరువు లీకేజీలతో పంట సాగు కష్టంగా మారింది. పొలంలో జోము ఏర్పడి ట్రాక్టర్ దిగితే బురదలో ఇరుక్కుపోతుంది. వరి పంట వేయాలన్నా కష్టమైపోతుంది. పంట కోత కోయడానికి యంత్రాలు దిగే పరిస్థితి లేదు. నాకున్న అర ఎకర పొలం బీడుగా మారకుండా అతి కష్టం మీద వరి పంటను సాగు చేస్తున్నాను. కోత యంత్రాలు పొలంలో దిగాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది.

కాలనీ కబుర్లు

నందికొట్కూరు, న్యూస్‌టుడే :

హాజీనగర్ (నందికొట్కూరు) : హాజీనగర్ కాలనీలో ఇటీవల నిర్మాణం చేసిన సీసీ రహదారికి ఇరువైపుల మట్టి వేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

బైరెడ్డి రాజశేఖరరెడ్డి నగర్ (నందికొట్కూరు) : బైరెడ్డి రాజశేఖరరెడ్డి నగర్ కాలనీలో పురపాలక ఆధ్వర్యంలో సీసీ నిర్మాణానికి ఐదునెలల క్రితం కంకర వేసి వదిలేయడంతో వాహనాలకు ఇబ్బందిగా మారింది.

శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయం (నందికొట్కూరు) : శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయం వద్ద అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జీ వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వాహనాల రద్దీ కావడం, స్థానికంగా కళాశాలలు, ఆసుపత్రికి వెళ్లే దారి కావడంతో రాకపోకలు నిలిచి పోతున్నాయి.

సాయిబాబపేట (నందికొట్కూరు) : సాయిబాబ కాలనీ నుంచి సీఎస్ఐ స్మశాన వాటికకు వెళ్లే రహదారిలో చెత్తా చెదారం వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది.

నందికొట్కూరు, న్యూస్‌టుడే : శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారికి తొమ్మిది రోజుల అలంకరణకు కిరణ్ టెక్స్‌టైల్స్ యజమాని లక్ష్మినారాయణ, నాగేశ్వరమ్మ దంపతులు 10 చీరెలు వితరణ చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే : దామగట్ల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన మండల స్థాయి పోటీల్లో నందికొట్కూరు పట్టణానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలచినట్లు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

సేవా గుణాన్ని పెంపొందించడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం

ప్యాపిలి, న్యూస్‌టుడే: సేవా గుణాన్ని పెంపొందించడమే ఎన్‌ఎస్‌ఎస్(జాతీయ సేవా పథకం) లక్ష్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు సుబ్బయ్యశాస్త్రి పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవ వేడుకలను ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం అధికారి నవీన్‌సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను అభ్యసించడంతో పాటు సామాజిక సేవను అలవరచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. రామకృష్ణయ్య, నవీన్, సత్యబాబు, ఓబులేసు, వెంకటరమణ, ముస్తాక్, శంకరయ్య, మద్దిలేటి, వెంకీ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

దాడి చేసిన వ్యక్తులపై కేసు

సంజామల, న్యూస్‌టుడే: దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమణయ్య తెలిపారు. సంజామలకు చెందిన శివానగేంద్ర ప్రసాద్ ఇంటి ఎదుట జాఫర్ హుస్సేన్ పశువుల పేడ, ఎరువులు వేస్తుండటంతో ఇరువురు తరుచూ గొడవ పడుతుండేవారు. మంగళవారం ఆయనపై జాఫర్ హుస్సేన్ కుమారుడు అల్లి హుసేన్ మరికొందరితో కలిసి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

శిరివెళ్ల: సమస్య: శిరివెళ్ల రాముని మాన్యం కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. **- రత్నమయ్య, కాలనీవాసి**

సమాధానం: వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- సాలమ్మ, సర్పంచి, శిరివెళ్ల**

అవుకు, న్యూస్‌టుడే: సమస్య: అవుకు మెట్టుపల్లె నీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రతగా ఉంది. **-పెద్దయ్య మెట్టుపల్లె**

సమాధానం: సమస్య తమ దృష్టికి వచ్చింది. వెంటనే ట్యాంకు పరిసరాలను శుభ్రం చేసే చర్యలు తీసుకుంటాం. **- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి**

ప్యాపిలి, న్యూస్‌టుడే: సమస్య: సిద్దనగట్టు గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. **- అంజనేయులు, గ్రామస్థుడు**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. **- దస్తగిరమ్మ, సర్పంచి**

ధర్మవరం సుబ్బారెడ్డికి అభినందనలు

బేతంచెర్ల, డోన్, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డికి కీలక నామినేటెడ్ పదవి దక్కింది. సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వం ఆయన్ను నియమించింది.


సుబ్బారెడ్డికి అభినందనలు తెలుపుతున్న తెదేపా పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి

వైకాపా ప్రభుత్వ హయాంలో తెదేపా డోన్ నియోజకవర్గ బాధ్యుడిగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో ఆయనకు కీలక పదవిని కట్టబెట్టారు. ఈ సందర్భంగా తెదేపా బేతంచెర్ల పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి, మండల సమన్వయకర్త ఉప్పర పాలశేఖర్, పార్టీశాఖ నేత విజయుడు మంగళవారం విజయవాడలో ధర్మవరం సుబ్బారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. సీడ్ కార్పొరేషన్ పదవి ఇప్పించినందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెదేపా నాయకుల సంబరాలు

తెదేపా నాయకులు డోన్‌లో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఆయన స్వగృహం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి బాణాసంచా కాల్చారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీను, యువ నాయకుడు గౌతంరెడ్డి, చిన్నానారెడ్డి, భరత్‌రెడ్డి పాల్గొన్నారు. సుబ్బారెడ్డికి నామినేటెడ్ పదవి దక్కడంతో తెదేపా నేతలు మాదినేని నారాయణస్వామి, నాగేశ్వరరెడ్డి, జీవన్ చౌదరి బేతంచెర్లలో సంబరాలు చేసుకున్నారు. నాయకులు రమేష్‌రెడ్డి, మధు, వేణుగోపాల్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న తెదేపా నాయకులు

సీఐపై చర్యలు తీసుకోవాలి

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: డోన్ సీఐ ఇంతియాజ్ బాషాపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోవెలకుంట్ల న్యాయవాదులు డిమాండ్ చేశారు. కోవెలకుంట్లలోని కోర్టు ఎదుట న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో వారు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డోన్ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి ప్రసాద్‌పై సీఐ అక్రమ కేసు బనాయించారన్నారు. ఈ విషయంలో సీఐపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తికి, నంద్యాల జిల్లా ఎస్పీకి వినతిపత్రం పంపామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, ఉపాధ్యక్షుడు తిరుపాలు, సీనియర్ న్యాయవాదులు వాసగిరి సాయికృష్ణమూర్తి, బాలమురళీకృష్ణ, తిరుపతయ్య, నరసింహుడు, విష్ణుమనోహర్‌రెడ్డి, రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రకృతి వ్యవసాయంలో రాణించాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంపై మహిళలు అవగాహన పెంచుకొని రాణించాలని నంద్యాల సెర్ప్ పీడీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మహిళలు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యకరమైన పంటలతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంపీ లక్ష్మయ్య, ఏపీఎం సురేష్, కృష్ణమూర్తి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

భూసార పరీక్షలు లాభదాయకం

యాగంటిపల్లె, మీరాపురం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: భూసార పరీక్షలు ఎంతో లాభదాయకమని కేవీకే శాస్త్రవేత్త రమణయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని యాగంటిపల్లె, మీరాపురం రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు పలు పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.


పొలం పిలుస్తుంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

నిలిచిన నిర్మాణాలు.. అందని సేవలు


బోడెమ్మనూరులో అసంపూర్తిగా పాలశీతలీకరణ భవనం

ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం

కోవెలకుంట్ల మండలం గుల్లదుర్తి గ్రామంలో రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో అదనపు గది నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. తెదేపా ప్రభుత్వం ఉన్నప్పుడు 2019లో రూ.7.90 లక్షలతో ఎస్‌ఎస్‌ఏ కింద అదనపు గది మంజూరు కావడంతో నిర్మాణ పనులు చేపట్టారు. పిల్లర్ల వరకు నిర్మాణం జరిగి మధ్యలోనే పనులు ఆగిపోయాయి. అనంతరం వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారులు బిల్లులు రాక పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. పాఠశాలలో మొత్తం 62 మంది విద్యార్థులు చదువుతున్నారు. రెండు తరగతి గదులు ఉండటంతో విద్యార్థులతో పాటు పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఒకే గదిలో 1, 2 తరగతులు, మరో గదిలో 3,4,5 తరగతులకు బోధన చేస్తున్నారు.

రూ.కోట్ల ప్రజా ధనాన్ని వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు చాలా చోట్ల నిలిచిపోయాయి. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఏళ్లుగా ఆ నిర్మాణాలు మధ్యలో నిలిచి నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఆ నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ**

కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడామైదానంలో గత తెదేపా ప్రభుత్వంలో చేపట్టిన ఇండోర్ స్టేడియం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత తెదేపా ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేసి మంజూరు చేయించారు. సుమారు రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని ప్రారంభించారు. బేస్‌మెంట్, పిల్లర్ల వరకు పనులు జరిగి ఎన్నికల కోడ్ రావడంతో మధ్యలో పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించింది.

☛ ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరులో పాలశీతల కేంద్రం ఏర్పాటుకు ఉపాధి హామీ పథకం కింద రూ.12 లక్షలు కేటాయించారు. గుత్తేదారుడు భవన నిర్మాణానికి రూ.5 లక్షలు ఖర్చు చేశారు. బిల్లులు రాకపోవడంతో పనులు కొనసాగించడానికి గుత్తేదారుడు ఆసక్తి చూపలేదు. ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను నిలిపివేయాలని వైకాపా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో పాలశీతల భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఉయ్యాలవాడలో సచివాలయ భవన నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారు. గుత్తేదారుడు రూ.8 లక్షలు ఖర్చు చేసి పిల్లర్ల వరకు పనులు చేశారు. హరివరంలోనూ సచివాలయ భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది.


కోవెలకుంట్లలో నిలిచిపోయిన స్టేడియం నిర్మాణం

విరాళం అందజేత

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: వరదలతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జె.చంద్రశేఖర్ పేర్కొన్నారు. వరద బాధితుల సహాయార్థం డోన్ ఇందిరానగర్‌లోని వాసవి ఉన్నత పాఠశాల విద్యార్థులు తమవంతు బాధ్యతగా పట్టణంలో రూ.15,554 విరాళాలు సేకరించారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్‌తో కలిసి పాఠశాల యాజమాన్యానికి మంగళవారం నగదును అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు మహేశ్వరరెడ్డి, కుల్లాయిరెడ్డి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో యూపీఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు అక్బర్ పాషా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠశాల యాజమాన్యానికి డబ్బులు అందజేస్తున్న విద్యార్థులు

సాగు భూమిని ఆన్‌లైన్ చేయాలి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల మండలంలో పేదలు సాగు చేసుకుంటున్న 4 వేల ఎకరాల రెవెన్యూ వివరాలు ఆన్‌లైన్ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూముల ఆన్‌లైన్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి కోరారు. బేతంచెర్ల తహసీల్దార్ ప్రకాష్ బాబును కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు న్యాయం చేయాలన్నారు. ఎంతో మంది రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోవాలంటే ఇబ్బందులు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. మండల అధ్యక్షుడు అంజనేయులు, శివరామిరెడ్డి, బాలరాజు, హరినాయుడు, రాజు, ప్రకాష్, ఉపేంద్ర, జనసేన మధు, నాగేంద్ర పాల్గొన్నారు.


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బాధ్యతల స్వీకరణ

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్‌గా వనితాలక్ష్మిని నియమించారు. ఇక్కడ పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ ఖరీమ్‌ను ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ఆమె మంగళవారం స్థానిక కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్‌గా చేతన్ రాయల్ మంగళవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న చేతన్ రాయల్‌కు దస్తావేజు లేఖరులు, స్టాంపు విక్రయదారు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఐదుగురు వీఆర్వోల బదిలీ

అవుకు, న్యూస్‌టుడే: మండలంలోని ఐదు గ్రామాలకు చెందిన వీఆర్వోలకు స్థానచలనం జరిగింది. సాధారణ బదిలీల్లో భాగంగా అవుకులో పని చేస్తున్న చంద్రహాసరెడ్డిని ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరుకు బదిలీ చేయగా, చెన్నంపల్లెలో పని చేసిన హైదర్ బాషాను అవుకు వీఆర్వోగా నియమించారు. చెర్లోపల్లె వీఆర్వో పెద్దయ్యను కొలిమిగుండ్ల మండలం తోళ్ళమడుగు గ్రామానికి, చనుగొండ్లకు చెందిన బాషాను వాగులమర్రికి, సుంకేసులకు చెందిన మద్దిలేటిని కర్నూలు జిల్లాకు బదిలీ చేసినట్లు తహసీల్దారు మల్లికార్జునరెడ్డి తెలిపారు. బదిలీలు అక్టోబరు రెండు తరువాత అమల్లోకి వస్తాయని ఆయన వెల్లడించారు.

కోట్లను కలిసిన మున్సిపల్ కమిషనర్

డోన్, న్యూస్‌టుడే: మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఎమ్మెల్యే కోట్లను ఆయన స్వగృహంలో మంగళవారం కలిశారు. నూతనంగా డోన్‌కు బదిలీపై వచ్చిన ఆయన కోట్లను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అన్ని విధాలుగా కృషి చేయాలని, ప్రజలకు మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోట్ల సూచించారు.



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డోర్నిపాడు, న్యూస్‌టుడే: వెంకటేశ్వర స్వామి పవర్ పంపింగ్ పేరిట ఎన్నడూ లేనంతగా కూడా కల్తీ నెయ్యి కలిపిన ఘనత వైకాపా ప్రభుత్వానిదేనని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆరోపించారు. డోర్నిపాడు వెలుగు కార్యాలయంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో సీఎం ఇచ్చిన హామీలను ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో చక్కర్లు చుట్టుకుంటున్నారు. మీడియా ముందుకు వచ్చి ప్రభుత్వంపై బురద జల్లటానికే పనికట్టుకున్న వైకాపా నాయకులు ఉన్నారన్నారు. అనంతరం కొత్త పింఛన్లు, నాయకులు పంపిణీ చేశారు. పక్కనే ఉన్న బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. నాయకులు సత్యం, అమరేశ్వర యాదవ్, కాశీశ్వర్‌రెడ్డి, నారాయణ, నాయుడు, పాండు శ్రీను, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

బేతంచెర్ల, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెదేపా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మేకల నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి రూబెన్ అన్నారు. మంగళవారం బేతంచెర్ల పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని 13, 14 వార్డుల్లో వార్డు కౌన్సిలర్ రంగోపాల్ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి, వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. తెదేపా నాయకులు పయాస్, శ్రీపతి నాగరాజు, కానాల అంజి, పోల మధు, శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్యాపిలి, న్యూస్‌టుడే: అన్ని వర్గాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెదేపా మాజీ ఎంపీపీ టి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 100 రోజులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు రామ్మోహన్‌యాదవ్, నాగేంద్ర, పెద్ద రామాంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, బాలకృష్ణ, నరేంద్ర, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం పథకంలో భాగంగా తెదేపా మండల అధ్యక్షుడు మూలె రామేశ్వర్‌రెడ్డి కొలిమిగుండ్లలో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా ఇంటింటికి తిరిగి తెదేపా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. నాయకులు గూడూరు నాగేశ్వర్‌రెడ్డి, నరసింహుడు, బొట్టుస్వామి, టైలర్ రామి, సీతారామయ్య, చంద్రశేఖర్, విజయ్, దస్తగిరి పాల్గొన్నారు.

సంజామల, న్యూస్‌టుడే: తెదేపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజల పేదరికం పట్టెడు అన్నం దొరుకుతోందని ముక్కమల్ల గ్రామ తెదేపా నాయకుడు ముసాని చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముక్కమల్ల గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి వంద రోజుల్లో తెదేపా సాధించిన అభివృద్ధిని కూడిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆకుమల్ల గ్రామంలో గ్రామ తెదేపా నాయకులు యనకంటి తిమ్మయ్య, దుబ్బు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పోటీలకు ఆళ్లగడ్డ పాలసాగరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 21న కర్నూలులోని డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన సెపక్‌తక్రా, రోప్ స్కిప్పింగ్ పోటీల్లో కె.నారాయణరెడ్డి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 23వ తేదీన నంద్యాలలోని ఎస్‌పీఎం మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరిగిన జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో యుగంధర్, దర్గ దస్తగిరి, వెంకట సంతోష్‌కుమార్‌రెడ్డి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు బి.వి.బాబును ప్రధానోపాధ్యాయుడు బి.మురళీధర్ అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

డోన్, న్యూస్‌టుడే: క్రీడలతో మానసిక శారీరక ఉల్లాసం కలుగుతుందని ఒత్తిడి తగ్గించుకునేందుకు ఉపయోగపడతాయని మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ కొట్రికె హరికిషన్ పేర్కొన్నారు. స్థానిక క్రీడా స్టేడియంలో నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు.


పోటీలను ప్రారంభిస్తున్న హరి కిషన్

పాతపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన ఈ క్రీడలను నిర్వహించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు చెందిన ఇద్దరు బాలబాలికలు ఇందులో ప్రతిభకనబరచిన వారు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. తెదేపా నాయకులు శేషిరెడ్డి, రమణ, అబ్బిరెడ్డి పాల్గొనగా వారిని వ్యాయామ ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డిని ఉపాధ్యాయులు, నాయకులు కలిసి సన్మానించారు. నాయకులు ఓంప్రకాష్, పంచాయతీ రాజ్ ఈఈ గంగాధర్, ప్రిన్సిపల్ వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల, (న్యూస్‌టుడే): శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని మండల విద్యాధికారి అబ్దుల్ కలామ్ పేర్కొన్నారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను స్థానిక ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు హుసేనయ్య, ఉపాధ్యాయులు వైఎస్ నారాయణరెడ్డి, పీడీ కంబగిరి, గంగాదేవి పాల్గొన్నారు.

బనగానపల్లి (గ్రామీణం), న్యూస్‌టుడే: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఎంఈవో స్వరూప పేర్కొన్నారు. మండల పరిధిలోని పలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అలాగే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

భాగ్యనగర్ (డోర్నిపాడు), న్యూస్‌టుడే: డోర్నిపాడు మండలం భాగ్యనగర్‌లోని జిల్లా ఉన్నత పాఠశాలలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డోర్నిపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్లే సమయంలో పాఠశాలను ఎమ్మెల్యే మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లో పంకాలు, పాఠశాల ప్రహరీ, ఆట స్థలం తదితర సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

పాడి రైతులకు ఆర్థిక భరోసా



కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: పశుపోషణపై ఆధారపడి జీవించే పాడి రైతు కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. ఆర్థికంగా అండగా నిలిచి ఆదుకొని పాడి రంగాన్ని ప్రోత్సహించేందుకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు యోజన పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో పశువుల మేత, వైద్యానికి డబ్బులు లేక పోతే ఎక్కువ వడ్డీకి ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించకుండా ఉండేందుకు పీకేసీసీ (పశు కిసాన్ క్రెడిట్ కార్డు) ద్వారా బ్యాంకు నుంచి రుణాలు పొందడానికి అవకాశం కల్పించింది. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, బనగానపల్లి, శ్రీశైలం, నందికొట్కూరు, పాణ్యం, నంద్యాల నియోజకవర్గాల్లో 9 వేల మందికి క్రెడిట్ కార్డులు ఇవ్వాలన్నది లక్ష్యం. కాగా ఇప్పటి వరకు 2,478 మంది నుంచి కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

రూ.3 లక్షల రుణ సౌకర్యం

పశు కిసాన్ క్రెడిట్ కార్డుతో రూ.3 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉంది. రూ.1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాన్ని పొందవచ్చు. తీసుకున్న రుణాన్ని 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే 7శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోపు క్రమం తప్పకుండా చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 3శాతం వొప్పున వడ్డీ రాయితీ ఇస్తాయి. మిగిలిన ఒక శాతం రైతులు చెల్లిస్తే సరిపోతుంది.

అర్హతలు ఇవే

ఆవు, గేదెలకు సంబంధించిన పాడి రైతులకు 2 నుంచి 9 వరకు పశువులు ఉండాలి. మేకలు, గొర్రెల పాడి రైతులకు 20 నుంచి 30 కలిగి ఉండాలి. పశువుల కలిగినట్లు పశు వైద్యుల నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. పీఎం కిసాన్ లబ్ధిదారుడై ఉండాలి. బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, పూర్తి చేసిన వివరాలతో కలిసి రైతు సేవా కేంద్రాలు లేదా పశువైద్యశాలల్లో అందజేయాలి.

నంద్యాల జిల్లాలో	
పశువులు	మొత్తం
ఆవులు	1.20 లక్షలు
గేదెలు	2.93
మేకలు	3.05
గొర్రెలు	8.82

సద్వినియోగం చేసుకోవాలి - నాగ శైలజ, పశువైద్యాధికారిణి, ఉయ్యాలవాడ

ఈ పథకం పాడి రైతులకు ఎంతో ఆసరాగా నిలుస్తుంది. పశు పోషకులు ఆర్థికంగా తోడ్పడుతుంది. ఆర్థిక అవసరాలకు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి అప్పులపాలు కాకుండా బ్యాంకులు సహకారంతో పాడి రంగంలో రాణిస్తూ కుటుంబాలకు అండగా ఉంటుంది. ఈ పథకాన్ని అర్హులైన పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

చాగలమర్రి, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ తెలియజేశారు. చాగలమర్రి పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని కేసుల వివరాలను ఎస్సై రమేష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలో అక్రమ మద్యం, నాటుసారా, మట్కా, జూదం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

మన ఇల్లు మన గౌరవంపై సమీక్ష

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మన ఇల్లు మన గౌరవం పథకంపై సమీక్ష నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య మండల అధికారులతో సమావేశమయ్యారు. ఈ నెల 28వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే మన ఇల్లు మన గౌరవం పథకం గురించి లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. 2019 నుంచి 2024 వరకు మంజూరైన ఇళ్లు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరేస్ లెవెల్లో ఉన్న గృహాలు అక్టోబర్ 2024, బీఎల్, ఆర్ఎల్ లెవెల్‌లో ఉన్న గృహాలు మార్చి 2025లోపు పూర్తి చేయకుంటే డబ్బులు ఖాతాలో జమ కావన్నారు. ఎంపీడీవో మహబూబ్‌ఖాన్, తహసీల్దారు రత్నకుమారి పాల్గొన్నారు.


మండల అధికారులతో సమావేశమైన ప్రత్యేకాధికారి వెంకటసుబ్బయ్య

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కొత్తబుర్జు(డోన్), న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ పుష్పక్, కెనరా బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తబుర్జులో ఉపాధి శిక్షణ సంస్థ, కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో పాడిపశు మహిళలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

ప్రజలు భాగస్వాములవ్వాలి

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని స్వర్ణాంధ్ర 2047 సాధించేందుకు ప్రజలు సహకరించాలని, అలోచనలను తెలియజేయాలని హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 గోడపత్రాలను ఆయన మంగళవారం విడుదల చేశారు. ప్రజా వేదికలు, గ్రామ సభలు, ఫ్యాకల్టీ ద్వారా దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తహసీల్దారు రత్నకుమారి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పంచాయతీ


చాగలమర్రి ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

మేజర్ పంచాయతీ	జనాభా (వేలల్లో)
బనగానపల్లి	40
పలుకూరు	10
చాగలమర్రి	25
కోవెలకుంట్ల	15
రుద్రవరం	8

చాగలమర్రి, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీల్లో ప్రధాన రహదారులపై నిత్యం మురికి, రహదారుల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో చాగలమర్రి, శిరివెళ్ల, రుద్రవరం, బనగానపల్లి, యర్రగుంట్ల మేజర్ పంచాయతీలు ఉన్నాయి. బనగానపల్లె మండల పరిధిలో బనగానపల్లె, పలుకూరు మేజర్ పంచాయతీలు ఉండగా, డోన్ మండల పరిధిలో చిన్నమల్కాపురం మేజర్ పంచాయతీ ఉంది. ఆయా పంచాయతీల్లో నిత్యం మురుగు, రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ పలుకూరు మేజర్ పంచాయతీలో ప్రధాన రహదారులపైనే మురుగు ప్రవహిస్తూ దోమలకు నిలయంగా మారింది. కాలనీల్లో కాలువలు లేకపోవడంతో మురుగు సమస్య ఎక్కువ కావడంతో దోమల బెడద అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మేజర్ పంచాయతీలో ప్రధాన సమస్య మురికి సమస్య వేధిస్తుంది. కాలువలు సరిగా లేక ప్రధాన రహదారులపైనే మురుగు ప్రవహిస్తుంది. పట్టణంలోని ముత్యాలపాడు బస్టాండ్ పరిసరాల్లో నిత్యం రహదారిపై మురుగు ప్రవహిస్తుంది. దీంతో దోమల బెడద అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

తరలింపు చేయిస్తాం. పలు కాలనీలకు సీసీ రహదారులు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే బురదలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. కోవెలకుంట్ల మేజర్ పంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పట్టణ ప్రధాన రహదారులపైనే మురుగు ప్రవహిస్తుంది. చాగలమర్రి


పలుకూరులో పరిస్థితి

రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపాం

- తాహీర్ హుసేన్, ఈవోపీఆర్డీ, చాగలమర్రి

చాగలమర్రి మేజర్ పంచాయతీ పరిధిలో కాలువల సమస్య పరిష్కారానికి దాదాపు రూ.30 లక్షలతో జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు చేస్తే వెంటనే పనులు చేసి సమస్యను పరిష్కరిస్తాం.